## క్లుప్తంగా

### ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న డాక్టర్ రాకేష్ కుమార్

**జూలూరుపాడు:** ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెంచాలని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాకేష్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన ఆశా డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రతీఒక్కరు కృషి చేయాలన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ తిరిగి ప్రజల ఆరోగ్య పరిస్థితులపై ఎప్పటికప్పుడు ఆస్పత్రికి తెలియపరచాలని సూచించారు. అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలను చైతన్య పరచాలన్నారు. కుటుంబ నియంత్రణ పాటించేవిధంగా చూడటంతోపాటు, మాతాశిశు మరణాల రేటు తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. గర్భిణుల ప్రసవాలు ప్రభుత్వాస్పత్రుల్లో జరిగేలా చూడాలన్నారు. చిన్నారుల్లో వచ్చే శ్వాసకోస వ్యాధులుపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. న్యుమోనియా (నిమ్ము), టీబీ(క్షయ), జ్వరాలు, జలుబు, దగ్గు, జ్వరాలు, షుగరు, బీపీ, హెచ్ఐవీ వంటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పోటు వినోద్, సీహెచ్ఓలు వి.వెంకటేశ్వర్లు, రామకృష్ణ, హెచ్ఎస్ రత్నకుమార్, హెచ్‌వీలు సుభద్రమ్మ, రాధిక, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### రిజర్వేషన్లను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి

**కొత్తగూడెంఅర్బన్:** రిజర్వేషన్లను సద్వినియోగం చేసుకుని మహిళలు అన్నిరంగాల్లో మహిళాలు ముందుండాలని చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలో వివిధ విభాగాలలో పని చేస్తున్న మహిళలను సన్మానించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ... మహిళలు ఆర్థికంగా ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శేషాంజన్ స్వామి, మేనేజర్ ఎల్‌వీ.సత్యనారాయణ, టీపీఎస్.ప్రభాకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, వీరభద్రాచారి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

### జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

**జూలూరుపాడు:** జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్మికులు మాట్లాడుతూ... ఐదు నెలల పెండింగ్ వేతనాలను చెల్లించాలన్నారు. నెలసరి వేతనం రూ.18 వేలకు పెంచడంతోపాటు, పర్మనెంట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మండల పరిషత్ సూపరింటెండెంట్ తాళ్లూరి రవికి అందజేశారు. కార్యక్రమంలో జీపీ కార్మికులు బి.వీరు, ఎస్కే గౌస్‌బాబా, టి.లక్ష్మి, సునీత, గురవమ్మ, బి.నగేష్, విజయ, నరసింహారావు పాల్గొన్నారు.

### మండలస్థాయి ప్రతిభా పరీక్ష



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

**ఇల్లెందురూరల్:** మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మంగళవారం ప్రతిభా పరీక్ష నిర్వహించారు. మండలంలోని ఏడు స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో నిర్వహించిన ప్రతిభా పరీక్షలో మొదటి మూడు స్థానాలలో నిలిచిన 21 మంది విద్యార్థులు మండల స్థాయిలో నిర్వహించిన ప్రతిభా పరీక్షకు హాజరయ్యారు. పాల్గొన్న విద్యార్థులకు ఎంఈఓ పిల్లి శ్రీనివాస్ ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.

# మున్సిపల్ బడ్జెట్లకు ఆమోదం

- 'గూడెం'మున్సిపాలిటీ అంచనా బడ్జెట్ రూ.83.52 కోట్లు
- ఆమోదించిన పాలకవర్గం

**కొత్తగూడెంఅర్బన్:** కొత్తగూడెం మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ బడ్జెట్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశానికి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ముఖ్యఅతిథిగా హాజరు కాగా, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) విద్యచందన హాజరయ్యారు. మున్సిపల్ బడ్జెట్‌పై చర్చించి ఆమోదించారు. మున్సిపల్ చట్టం 2018 సెక్షన్ 107, సెక్షన్ 100 ప్రకారం మున్సిపల్ ఆదాయం నుంచి జీతాలు, పొరుగు సేవల ఉద్యోగుల జీతాలు, పారిశుద్ధ్య నిర్వహణ, కరెంటు బిల్లు, గత వాయిదాల చెల్లింపులు, 10 శాతం నిధులను (పురపాలక సంఘం సొంత ఆదాయ వనరులు, 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి) హరితహారం పనులను కేటాయించినట్లు వివరించారు. ఆదేవిధంగా పైన తెలిపిన తప్పనిసరి పద్దులకు కేటాయింపులు పోను మిగిలిన పురపాలక సంఘ సొంత నిధుల నుంచి 1/3 వంతు నిధులను పురపాలక సంఘంలో విలీనమైన ప్రాంతాలు, అభివృద్ధి చెందని ప్రాంతాలు, బలహీన వర్గాల ప్రజలు నివసించే ప్రాంతాలు, మైనారిటీ ప్రజలు నివసించే ప్రాంతాలు, మురికి వాడల్లో మౌలిక వసతుల కల్పనకు బడ్జెట్‌లో కేటాయింపులు చేసినట్లు పేర్కొన్నారు. తదుపరి మిగిన పురపాలక సంఘ నిధులను పార్కులు, వైకుంఠధామాల అభివృద్ధి, ప్రజా మరుగుదొడ్ల నిర్మాణము, సమీకృత సమతల అభివృద్ధి నిర్వహణ, వివిధ వార్డులలో అభివృద్ధి పనులకు కేటాయింపులు చేయడం జరిగిందని వివరించారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి, మున్సిపల్ మేనేజర్ ఎల్‌వీ సత్యనారాయణ, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ కిరణ్‌కుమార్, మున్సిపల్ డిప్యూటీ ఇంజనీర్ రవికుమార్, ఏఈ కె.సాహితి, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ బి.ప్రభాకర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

**బడ్జెట్ అంచనా (రూ.కోట్లలో)**

| | |
|---|---|
| ఆదాయం | 81.56 |
| వ్యయం | 83.52 |

**ప్రజలను మభ్యపెట్టే అంకెల గారడీ...**

**కొత్తగూడెంఅర్బన్:** కొత్తగూడెం మున్సిపాలిటీలో ప్రవేశపెట్టిన 2024– 25 బడ్జెట్ ప్రజలను మభ్యపెట్టే అంకెలగారడీగా ఉన్నదని 10వ వార్డు సీపీఐ కౌన్సిలర్ మునిగడప పద్మ ఆరోపించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్లో జరిగిన బడ్జెట్ సమావేశాల్లో ఆమె మాట్లాడారు. 2023 –24 అంచనా రాబడి రూ.6.52 కోట్లు చూయించి కేవలం రూ.3.58 కోట్లు ఆదాయాన్ని మాత్రమే రాబట్టారని, ఆదాయాన్ని సమకూర్చుకోవడంలో అధికారులు, అధికార ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని విమర్శించారు. గత ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ వారి కోటాలో ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పట్టణ ప్రగతి, స్వచ్ఛభారత్ నిధులు రాకపోతే ఒక్క మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచే కార్మికుల జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉండేదన్నారు. పట్టణ ప్రజలపై భారం మోపకుండా, కొత్తగూడెం మున్సిపాలిటీ ఆదాయాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దినసరి మార్కెట్, సంత టెండర్లలో ఆదాయాన్ని రాబట్టడంలో అధికార యంత్రాంగం విఫలమైందన్నారు. ఇలా అయితే మున్సిపాలిటీ ఎలా అభివృద్ధి చెందుతుందని ఆమె విమర్శించారు. ఈ బడ్జెట్ కూడా గజిబిజి గందరగోళంగా వాస్తవ బడ్జెట్‌గా లేదని పేర్కొన్నారు.

- ఇల్లెందులో రూ.15.76 కోట్లు
- బడ్జెట్ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే కోరం కనకయ్య

**ఇల్లెందు:** గతంలో అనేక రకాల నిధులు సమకూరుతాయని ఆశాభావంతో అంచనాను పెంచి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈసారి అలా కాకుండా వాస్తవిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టి ఆమోదించారు. మంగళవారం ఇల్లెందు మున్సిపల్ బడ్జెట్ సమావేశం చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అధ్యక్షత జరిగింది. కమిషనర్ నవీన్ ఈ సమావేశంలో బడ్జెట్ ప్రతిపాదించారు. చర్చించిన సభ్యులు ఆమోదించారు. ఆస్తి పన్నులు, అసైన్డ్ రెవెన్యూలు, రెమ్యునరేటివ్ ఎంటర్‌ప్రైజెస్ / రెంటల్ ఆదాయం, ప్రజారోగ్యం, పారిశుద్ధ్య విభాగం, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగం, ప్రణాళికేతర నిధులు, ప్లాన్ నిధులు, ఇతర నిధులపై సమగ్రంగా చర్చించి ఆమోదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కనకయ్య మాట్లాడుతూ.. ఆదాయ వనరులను పెంచుకోవాలని, మరోమారు ప్రత్యేక సమావేశం నిర్వహించి సమష్టిగా సమాలోచనలు చేసి పట్టణ అభివృద్ధికి పక్కా ప్రణాళికలు రూపకల్పన చేసుకోవాల్సి ఉందన్నారు. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. కొంతకాలంగా పట్టణ అభివృద్ధి శరవేగంగా జరుగుతోందన్నారు. మోడల్ మార్కెట్, వెండర్ జోన్, షాపింగ్ కాంప్లెక్స్‌ల వల్ల పట్టణానికి ఆదాయం పెరిగిందని చెప్పారు. ఇల్లెందు కౌన్సిల్ 2023–24 సవరణ బడ్జెట్, 2024–25 అంచనా బడ్జెట్ సమావేశంలో చర్చించి ఆమోదించారు. పొరుగు సేవలలో పని చేసే నీటి సరఫరా ఎలక్ట్రిసిటీ, ఆఫీస్ సిబ్బంది జీత భత్యాలకు రూ.2.68 కోట్లు, పారిశుద్ధ్య నిర్వహణకు రూ.84.30 లక్షలు, విద్యుత్ చార్జీలు రూ.93 లక్షలు, ఈఈఎస్ఎల్ చెల్లింపులు రూ.15 లక్షలు, 10శాతం హరిత బడ్జెట్ రూ.63 లక్షలు, ఇంజనీరింగ్ వ్యవస్థ నిర్వహణ వ్యయం రూ.78. 50 లక్షలు, సాధారణ పరిపాలన వ్యయం రూ.77.30 లక్షలు, పట్టణ ప్రణాళిక వ్యయం రూ.4లక్షలు, వివిధ ప్రభుత్వం గ్రాంట్ల ఖర్చులు రూ.8.32 కోట్లుగా నిర్ణయించారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొక్కు నాగేశ్వరరావు, కౌన్సిలర్లు, మేనేజర్ అంకుషావలీ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

**బడ్జెట్ అంచనా 2023-24 (రూ.కోట్లలో)**

| | |
|---|---|
| ఆదాయం | 40.68 |
| వ్యయం | 40.67 |

**సవరించిన బడ్జెట్**

| | |
|---|---|
| ఆదాయం | 12.09 |
| వ్యయం | 12.02 |

**బడ్జెట్ అంచనా 2024-25**

| | |
|---|---|
| ఆదాయం | 15.76 |
| వ్యయం | 15.45 |



సమావేశానికి హాజరైన కౌన్సిల్ సభ్యులు

### గణేష్ టెంపుల్‌లో హోమం..



పూజలో పాల్గొన్న ఈఓ సులోచన దంపతులు

**కొత్తగూడెంటౌన్:** మాఘమాసం చివరిరోజు మంగళవారం పట్టణంలోని శ్రీవిజయ విఘ్నేశ్వర స్వామి దేవస్థానం (గణేష్‌టెంపుల్)లో అర్చకులు మహా అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం మహా పూర్ణాహుతి పూజా కార్యక్రమంలో ఆలయ ఈఓ సులోచన దంపతులు పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

### విరాళం



విరాళం అందజేస్తున్న వినయ్, హరిత

**పాల్వంచరూరల్:** కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి దుమ్ముగూడెం మండలం తూరుపాక గ్రామానికి చెందిన మందపాటి వినయ్, హరిత దంపతులు రూ.10,116 విరాళం అందజేసినట్లు ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి మంగళవారం తెలిపారు. విరాళాలు అందజేసిన భక్తులకు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలను అందజేశారు.

### సీఎం సభకు తరలిన సెర్ప్ ఉద్యోగులు

**టేకులపల్లి:** సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మహిళా సదస్సుకు టేకులపల్లి సెర్ప్, వివిధ శాఖల నుంచి మహిళా ఉద్యోగులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సులో వెళ్లారు. ఎంపీఓ జక్కుల లక్ష్మీ, గణేష్ గాంధీ, సెర్ప్ ఏపీఎం రవికుమార్, పోలీసు కానిస్టేబుల్ ఇర్ప శిరోమణి, సునీల్ ఉన్నారు.

## శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన రైతులు

**టేకులపల్లి:** రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన లాభసాటి వ్యవసాయం తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు ఉద్దేశించిన దృశ్య శ్రవణ (వీడియో కాన్ఫరెన్స్) విధానాన్ని ఈనెల 6న రాష్ట్ర వ్యాపిత కార్యక్రమంలో భాగంగా ఇల్లెందు నియోజకవర్గానికి సంబంధించి టేకులపల్లి మండలం ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డులోని రైతువేదికలో ప్రారంభించారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో కార్యక్రమంలో భాగంగా మంగళవారం రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పలువురు అధికారులు, శాస్త్రవేత్తలు రైతులతో ముఖాముఖిగా మాట్లాడారు. శాస్త్రవేత్తలు రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రత ప్రభావం నుంచి పంటలను రక్షించేందుకు, మామిడిలో పిందె రాలుట, నివారణ చర్యలు గురించి చర్చించారు. మామిడి తోటలో తేనెమంచు పురుగు వలన ఆకులపై భాగంలో మసి ఉండటంతో మొక్కలు చనిపోయే అవకాశం ఉందని, నివారణకు సోడియం హైడ్రోక్లోరైడ్ ద్రావణాన్ని పిచికారీ చేయడం వల్ల నల్లమసి గట్టిపడి రాలిపోతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వి.బాబురావు, ఏడీఏ పి.వాసవీరాణి, మండల వ్యవసాయ అధికారి నీరుడు అన్నపూర్ణ, ఏఈఓలు శ్రావణి, విశాల, రమేష్, రెహానా, ప్రవీణ్, వంశీ పాల్గొన్నారు.

## ఓటు హక్కు వినియోగంపై అవగాహన

**చుంచుపల్లి:** కలెక్టర్ ఆదేశాల మేరకు చుంచుపల్లి మండలం గౌతంపూర్ గ్రామపంచాయతీలో మంగళవారం మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఓటరు నమోదు, సక్రమంగా వినియోగించుకునే విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జెడ్పీ సీఈఓ ఎస్.ప్రసునారాణి మాట్లాడుతూ... 18 సంవత్సరాలు నిండిన ప్రతీఒక్కరు ఓటరుగా పేరును నమోదు చేసుకోవాలని, అలాగే ప్రతీఒక్కరు బాధ్యతగా ఎన్నికల సమయంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని చెప్పారు. ఈ సమాచారాన్ని మహిళా సంఘాల సమావేశాల ద్వారా గ్రామాల్లోని ప్రజలందరికీ చేరవేసి ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జ్యోతి, గ్రామదీపిక పద్మ, పలువురు మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**పాల్వంచరూరల్:** అర్హత కలిగిన ప్రతీఒక్కరు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి కోరారు. మండల పరిధి జగన్నాథపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం మహిళా ఓటర్లతో ముగ్గులు వేయించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ... కొత్తగా అర్హత కలిగిన 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని, ఓటు హక్కు అనేది ప్రజాస్వామ్యంలో ఆయుధం అని దానిని ప్రతీఒక్కరు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ కనకదుర్గ, ఏపీఓ పొరండ్ల రంగా, గ్రామకార్యదర్శి సాయిరాం, సీసీ మురళి, సూపర్‌వైజర్ అనసూయ, ఎఫ్ఏ శంకర్ పాల్గొన్నారు.



చుంచుపల్లి: అవగాహన కల్పిస్తున్న సీఈఓ ప్రసూనారాణి

### బ్యాంక్ అకౌంట్‌ను కేవైసీ చేసుకోవాలి

**పాల్వంచరూరల్:** మహాలక్ష్మి పథకం కింద అర్హులైన లబ్ధిదారులు గ్యాస్ సబ్సిడీని పొందాలంటే ఈనెల 31లోగా గ్యాస్ కంపెనీలో బ్యాంక్ అకౌంట్ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

### ఏజెన్సీ అలవెన్స్ పెంచాలి



శివశంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**ఇల్లెందు:** ఏజెన్సీలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఏజెన్సీ అలవెన్స్ పెంచాలని ఏటీఎఫ్ పే కమిషన్ చైర్మన్‌ను కోరింది. మంగళవారం ఇల్లెందులో ఏటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోకాళ్ల శ్రీనివాసరావు, కబ్బాకుల రవి మాట్లాడుతూ... పీఆర్‌సీ –2023 కమిషన్ చైర్మన్ ఎన్.శివశంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఏజెన్సీ ఏరియాలో పని చేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులు హెచ్ఆర్ఏ, ఏహెచ్ఆర్ఏ ఎస్‌సీఏ స్లాబ్ రేట్లు పెంచాలని కోరారు. హెచ్ఆర్ఏను 15శాతం, ఏహెచ్ఆర్ఏ 12 శాతం, ఎస్‌సీఏ రూ.5 వేల వరకు పెంచాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో రాష్ట్ర కార్యదర్శి కోరం సంతోష్‌కుమార్, బొగ్గుల లక్ష్మయ్య, పూనెం రమేష్, దీలీప్, రాజు పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో ఉంటా..

**పాల్వంచ:** నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. డీఎంఎఫ్‌టీ నిధులు రూ.3.36 కోట్లతో మున్సిపాలిటీలోని మంచికంటి నగర్, మసీద్‌గుట్ట, చింతల చెర్వు, వెంకటేశ్వర హిల్స్ కాలనీ, బాపూజీనగర్, నెహ్రూనగర్, ప్రశాంత్ కాలనీల్లో పలు అభివృద్ధి పనులను మంగళవారం ప్రారంభించారు. కూనంనేని మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిత్యం అందుబాటులో ఉంటానన్నారు. ప్రాధాన్యత క్రమంలో రోడ్లు, డ్రెయినేజీలు, కల్వర్టులు, ఇతర అభివృద్ధి నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ వివేక్, మున్సిపల్ కమిషనర్ ఎ.స్వామి, డీఎస్పీ ఆర్.సతీశ్ కుమార్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సీడీపీఓ కనకదుర్గ, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, యర్రంశెట్టి ముత్తయ్య, ముత్యాల విశ్వనాథం, నాగసీతారాములు, నూకల రంగారావు, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, రాహుల్, బండి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

## మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

**కొత్తగూడెంఅర్బన్:** కొత్తగూడెం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం మంగళవారం చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఎజెండాలోని పలు అంశాలైన అవుట్ సోర్సింగ్ పద్ధతిన పని చేస్తున్న సిబ్బందికి వేతనాలు చెల్లించేందుకు రూ.5.81 కోట్లు పరిపాలన ఆమోదం కొరకు, చైర్‌పర్సన్, కమిషనర్ వాహన సౌకర్యం కొరకు ఖర్చు రూ.7.92 లక్షలు, స్వీపింగ్ మెషిన్ రిపేరుకు, వార్షిక నిర్వహణకు రూ.3.66 లక్షలు, మహిళా దినోత్సవం ఖర్చు రూ.లక్ష, ఇంటింటి చెత్త సేకరణ డ్రైవర్లకు వేతనాలు రూ.43 లక్షలు పరిపాలన ఆమోదం కొరకు పెట్టి కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్, కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, కమిషనర్ శేషాంజన్‌స్వామి, మున్సిపల్ మేనేజర్ సత్యనారాయణ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## వేతనాలు సకాలంలో చెల్లించాలి

**ఇల్లెందురూరల్:** నాలుగు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని గ్రామ పంచాయతీ వర్కర్లు మంగళవారం ఎమ్మెల్యే కోరం కనకయ్యకు తమ ఆవేదనను వివరించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు మండలంలో పర్యటించిన ఎమ్మెల్యేకు పంచాయతీ వర్కర్లు వినతిపత్రం అందజేశారు. పెండింగ్ వేతనాలు వెంటనే మంజూరు చేసేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, కొమరారంను మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ న్యూడెమోక్రసీ నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. 21పిట్ ఏరియాకు సింగరేణి సంస్థ ద్వారా గృహ వినియోగానికి విద్యుత్ సరఫరా కావడం వల్ల అధిక బిల్లులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ఈ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వ విద్యుత్ సరఫరాకు తక్షణం చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు వడ్ల శ్రీనివాస్, తాండ్ర లక్ష్మీనారాయణ ఎమ్మెల్యే కనకయ్యకు వినతిపత్రం అందజేశారు.

## పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



గర్భిణులకు సీమంతం చేస్తున్న దృశ్యం

**టేకులపల్లి:** అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లీబిడ్డలు, గర్భిణులకు పోషకాహారం ఇస్తున్నారని నిర్లక్ష్యం చేయకుండా ప్రతీరోజు అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి తెచ్చుకోవాలని ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు సీడీపీఓ కేఎం తార తెలిపారు. ఈ మేరకు మంగళవారం ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. పలువురు గర్భిణులకు సీమంతం, చిన్నారులకు, అక్షరాభ్యాసం చేయించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు ఉన్న ఆకుకూరలు, కూరగాయలు, పిండి వంటల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నిర్మల, సక్కుబాయి, స్థానిక అంగన్‌వాడీ టీచర్ పద్మావతి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మోతుకూరి పద్మ, ఆయా లోకేశ్వరి, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

**జూలూరుపాడు:** పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ చంద్రుగొండ ప్రాజెక్టు సీడీపీఓ సీహెచ్ నిర్మలాజ్యోతి అన్నారు. పోషణ పక్షోత్సవాల్లో భాగంగా వాగొడ్డుతండా అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలు, మహిళల హక్కులు, పోక్సో చట్టం, చైల్డ్‌లైన్ హెల్ప్‌లైన్–1098, ఉమెన్ హెల్ప్‌లైన్–181పై అవగాహన కల్పించారు. అంతకముందు సీడీపీఓ నిర్మలాజ్యోతి మాచినేనిపేట, గోపాతండా అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లల హాజరు శాతాన్ని పెంచడంతోపాటు, సమయపాలన పాటించాలని అంగన్‌వాడీ టీచర్లను ఆమె ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలను సమయానికి తెరిచి ఉంచాలని, రికార్డులు అప్‌డేట్‌గా ఉండాలన్నారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు సంబంధించిన వివరాలను యాప్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. కార్యక్రమంలో వాగొడ్డుతండా పాఠశాల హెచ్‌ఎం లాలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎం.లక్ష్మి, శకుంతల, అంగన్‌వాడీ టీచర్లు సుమిత్ర, సావిత్రి, లలిత, గర్భిణులు, బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.

## పల్లెల్లో రహదారులను మెరుగుపరుస్తాం..

**ఇల్లెందురూరల్:** ప్రతి పల్లెలోనూ అంతర్గత రహదారులను మెరుగుపరుస్తామని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మండలంలోని పూబెల్లి, ధనియాలపాడు, విజయలక్ష్మీనగర్, మిట్టపల్లి, ముత్తారపుకట్ట, మాణిక్యారం గ్రామాలలో డీఎంఎఫ్‌టీ నిధులు రూ.90లక్షల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతిహామీని ప్రాధాన్యత క్రమంలో అమలు చేస్తామన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమస్థాయిలో అమలు చేస్తూ ప్రతీ పల్లెను సమగ్రంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ఆరు గ్యారెంటీల దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియలో తప్పులు దొర్లాయని ఎవరూ ఆందోళన చెందవద్దని, అర్హత ఉండి పథకం వర్తించనివారు మరోమారు ధ్రువీకరణ పత్రాలతో ఎంపీడీఓ కార్యాలయంలో ఆన్‌లైన్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ చీమల నాగరత్నమ్మ, ఎంపీటీసీలు మండల రాము, పూనెం సురేందర్, పాయం కృష్ణప్రసాద్, బోడ సుమలత, ధనసరి శాంత, బానోత్ రోజా, ఎంపీడీఓ ధన్‌సింగ్, ఎంపీఓ చిరంజీవి, పంచాయతీరాజ్ డీఈ రామకృష్ణ, ఏఈ రాజు, పాయం స్వాతి, కల్తి పద్మ, ధనసరి స్రవంతి, శారద, ధనసరి రాజు, ఎట్టి హరికృష్ణ, బానోత్ రాంబాబు, నాగార్జున్, తాటి భిక్షం, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



విజయలక్ష్మీనగర్‌లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

**మోటార్ కార్మికులకు అండగా ఉంటా..**

**ఇల్లెందు:** పట్టణంలో 15 రకాల మోటార్ కార్మికులంతా ఒకేచోట ఉండి పనులు చేసుకునేలా ఆటోనగర్ ఏర్పాటు కోసం మోటార్ కార్మికులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మంగళవారం ఇల్లెందు ఆటోనగర్‌లో ఆల్ ఆటో వర్కర్స్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో తమకు ఆటోనగర్ కోసం స్థలం కేటాయిస్తామని ప్రకటించి సేకరించిన స్థలం అందకుండా పోయిందని కార్మికులు ఆవేదన చెందుతున్నారని, పట్టణంలో ఖాళీ స్థలం ఉంటే తప్పకుండా అందజేస్తానని తెలిపారు. 1/70 పరిధిలో రాని భూమి పట్టణంలో మాత్రమే ఉంటుందని, అలాంటి భూమి కోసం అధికారులతో చర్చించి ఓ నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. పలుచోట్ల ప్రభుత్వ భూములు ఉన్నాయని వాటిని సర్వే చేయమని అధికారులకు ఆదేశాలు ఇస్తే ఎవరో ఒకరు తమదేనంటూ వస్తున్నారని అలాంటి వారు తమ వద్ద ఉన్న హక్కులను కూడా అధికారులు పరిశీలించి కీలక నిర్ణయం తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. త్వరలో పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, నాయకులు అక్కిరాజు గణేష్, ఆటోనగర్‌కు చెందిన యూనియన్ నాయకులు కొండ శ్రీనివాస్, గొల్లమందల మల్లేష్, ఎంఏ రఫీ, గంది సదానందం, ప్రసాద్, ఉరవగొండ ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.